మినీ కథ



# జోక్యం

—ఆరుపల్లి

ఆ కాలనీలో ముచ్చటగా మూడు ఇళ్ళుగల బ్లాకు అది.

మొదటి ఇంట్లో ఆంజనేయులు బ్రహ్మచారి. రెండవ ఇంట్లో సరికొత్త చిలకా గోరింకల కాపరం. మూడవ ఇంట్లో గోవర్ధనుడు కూడా బ్రహ్మచారే.

మూడు ఇళ్ళది అరమరికలు లేని స్నేహం.

ఉన్నట్టుండి ఎక్కడో ఒక చోట సంచలనం చోటు చేసుకున్నట్టు మధ్య ఇంటి అతనికి, ఆమెకు ఘర్షణ ప్రారంభమైంది. సారాంశం ఆమె రామ భక్తురాలు, అతడు కృష్ణభక్తుడు.

ఇహ పరిస్థితి ఎలా వున్నదంటే రాముడు గొప్పవాడంటే, కృష్ణుడు గొప్పవాడని తీవ్రంగా అభిమాన సంఘంవారిలా వాదించుకుపోసాగారు.

చివరికి ఆమె కృష్ణుడిని నిందించి పచ్చి దొంగ, అనేక వేలమంది స్త్రీలతో కులికాడు, పరాచకాలు ఆడిన వ్యక్తి. రాముడు అలా కాదు, ఏకపత్నీవ్రతుడు. తండ్రి ఆజ్ఞను శిరసావహించినవాడు. అతని రాజ్యంలో ప్రజలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సుఖశాంతులతో గడిపారు అన్నది.

"దానికి అతడు ఏం తీసిపోని విధంగా శ్రీకృష్ణుడి ఘనత నీకు తెలియనిదిలా వుంది. అతని లీలలు అనేకం. ముక్కుపచ్చలారని వయసులోనే రాక్షసుల్ని చంపాడు. చిటికిన వేలితో గోవర్ధన పర్వతం ఎత్తాడు. గీత మహత్యం సంగతి సరేసరి" అన్నాడు.

ఈ సంఘర్షణ అటు బ్రహ్మచారి, ఇటు బ్రహ్మచారి చెవినబడి ఇద్దరూ హాజరై ఒకరు భర్తకి సపోర్టు చేస్తే, మరొకరు భార్య పక్షాన సపోర్టు చేశారు. అదికాస్తా వాదం తీవ్రంగా జరిగి కేకలు వేసుకునేంతవరకు ఎదిగింది. ఈలోగా ఎవరో చేరి బ్రహ్మచార్లు ఇద్దరికి గడ్డిపెట్టారు వాళ్ళ తగువులో ఎందుకు జోక్యం చేసుకుని అనవసరంగా దెబ్బలాడుకుంటున్నారని. దాంతో ఒకరికొకరు రుసరుసలాడుతూ తలుపులు వేసుకున్నారు.

ఆ రాత్రి మధ్యలో బ్రహ్మచార్లకు మధ్య ఇంటిలోంచి గుసగుసలు, పకపకలు, గలగల గాజుల చప్పుడు... ముద్దుల చప్పుడు వినిపించి ఆశ్చర్యంలో ముంచెత్తివేశాయి.

తెల్లవారింది.

స్కూటర్ దుర్రు... దుర్రు... మనగానే బ్రహ్మచార్లు తలుపులు తెరచి చూసేసరికి మధ్య ఇంటి అతడు ఆమెను దగ్గరగా స్కూటర్ వెనుక కూర్చోబెట్టుకుని తుర్రుమన్నాడు.

'అందుకే అన్నారు ఎవరి తగువుల్లోనైనా జోక్యం చేసుకోవచ్చుగాని భార్యాభర్తల తగవుల్లో జోక్యం కలుగజేసుకోకూడదని' అనుకుంటూ బ్రహ్మచారులు తలుపులు వేసుకున్నారు. ●

---

# ఎవరిదందాం భూమి

ఎవరిదందాం భూమి - ఎవరిది భూమి?
ధాతదా? మరి వారి తాతదా ఈ భూమి
ఎవని తాతది కాదు, ఎందుకీ వాదు,
రైతు భూమిది, అన్నదాతదీ భూమి

దోబూచు మేఘాలతో జూదమాడి,
చిటచిట ఎండకు చెమట నాకించి,
వాన కొట్టుకు తడిసి, వడదెబ్బ కండి,
ఆరుగాలం వంగి, కారిజం పిండి,
ములుముట్ట దొక్కి గడ్డలు పెకలదున్ని,
నారేసి, నీరేసి, నలితెగులు వాపి,
ప్రతికారుకో కొత్తపంట పండించి,
ధాన్య రాసులు పోసె — ధన్యుడీ రైతు
ఈ రైతుదేకాక, ఎవరిదీ భూమి
రైతుదే ఈ భూమి, రైతుది భూమి

రామునిదా భూమి, రాజుదా భూమి?
రామునిదా కాదు, రాజుదా కాదు,
పాండవులదికాదు, ప్రభువులది కాదు,
రావులదా కాదు, రాణాది కాదు,
కత్తులు తెగదిప్పి, ఖంగున గొట్టి
ఆక్రమించిన వారి దనలుకే కాదు
రాత్రనక పగలనక రక్షించుకొన్న
రైతుదే కదా భూమి — రైతుది భూమి

రాజు తెచ్చిచ్చెనా రైతుకు భూమి,
ఎవడిచ్చె రైతుకు ఈ పంట భూమి
సూర్యుని కిరణాలు సోకిన నాడే
కడుపులో బంగారు గనులతో మెరిసి,
ప్రళయ గర్జనలకు బెడిసి బీటెత్తి
కడలి ఉప్పెనలతో బుడబుడ మునిగి,
వాలుతూ, సోలుతూ, తేలింది భూమి.
దండి భూకంపాల గండాలు గడిచి,
చచ్చి ప్రబతికీ, పచ్చ పచ్చగా ఎదిగి,
నాగళ్ళ చక్కిలికి నవ్వింది భూమి
రక్ష — ఈ భూమికి రైతన్న ఒకడే
భూమంచి రైతుదే భూమిపై హక్కు
రైతుకే కద భూమి — రైతుదీ భూమి

మట్టితో ఆటాడి, మట్టితో పాడి,
మట్టిలోనే మురిసి, మట్టిలో కరిగి,
మట్టిలోనే బతికి, మట్టిలో ఒరిగి
మట్టి కంకితమయి మనగల్గినాడు
ఇలగరచి బంగారు కలలు గంటాడు
మట్టిదే నాగరిక మహిమ అంటాడు.
బంజర్లలో పంచ ప్రాణాలు ఒడ్డి
చచ్చుమట్టికి జీవసారమిస్తాడు
తనకాడి యెడ్లను తాకట్టు బెట్టి,
తుంపర వర్షాలతో జూదమాడి,
చిటచిట ఎండకు చెమటనాకించి,
వానకొట్టుకు తడిసి, వడదెబ్బకెండి,
ఆరుగాలం వంగి, కారిజం పిండి,
ములుముట్ట దొక్కి గడ్డలు పెకలదున్ని
నారేసి, నీరేసి, నలితెగులు వాపి,
ప్రతికారుకో కొత్తపంట పండించి,
ధాన్యరాసులు పోసె — ధన్యుడీ రైతు
ఈ రైతుదే కాక, ఎవరిదీ భూమి
రైతన్నదే భూమి
రైతన్నదీ భూమి
రైతన్నదీ భూమి

హిందీమూలం: శ్రీ కేదార్‌నాథ్ అగర్వాల్
అనుసరణ: డా. ముకురాల రామారెడ్డి